# ఆరు గ్యారెంటీలన్నీ ఉత్తవే



జగిత్యాలరూరల్ : చల్‌గల్‌లో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సంజయ్ కుమార్

- కాంగ్రెస్‌ను నమ్మితే మోసపోతం
- కర్ణాటకలో ప్రజలను నిండా ముంచింది
- సీఎం కేసీఆర్ రాష్ట్రానికి ఒక ధీమా
- జగిత్యాల అభ్యర్థి, ఎమ్మెల్యే డాక్టర్ ఎం సంజయ్ కుమార్

జగిత్యాల రూరల్, అక్టోబర్ 31: 'ఈ ఎన్నికల్లో ఎలాగైనా అధికారంలో రావాలని కాంగ్రెస్ కొత్త ఎత్తుగడలు చేస్తున్నది. అన్నీ అబద్ధాలు చెబుతున్నది. ఆరు గ్యారెంటీలంటూ మోసం చేస్తున్నది. అన్నీ ఫేక్ హామీలే. కర్ణాటకలో ఇలాగే గ్యారెంటీలంటూ ప్రజలను నిండా ముంచింది. వాళ్లను నమ్మితే మోసపోతం. జాగ్రత్త' అంటూ జగిత్యాల అభ్యర్థి, ఎమ్మెల్యే డాక్టర్ ఎం సంజయ్ కుమార్ ప్రజలకు పిలుపునిచ్చారు. ఆ పార్టీని నమ్మితే తెలంగాణ మళ్లీ చీకటవుతుందని, నేనొక్కటే ప్రశ్నిస్తున్నా.. 5గంటలు కరంట్ ఇచ్చే కాంగ్రెస్ కావాలా..? 24గంటలు ఇచ్చే బీఆర్‌ఎస్ కావాలా..? ఆలోచించుకోవాలని సూచించారు. జగిత్యాల మండలం చల్‌గల్‌లోని కుల సంఘాల పెద్దలు, మహిళలు, యువకులు 200 మంది వరకు బీఆర్‌ఎస్‌లో చేరగా, వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అలాగే జగిత్యాల రూరల్ మండలం వెలుర్థి గ్రామానికి చెందిన యూత్ కాంగ్రెస్ నాయకులను పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సంజయ్ కుమార్ మాట్లాడుతూ బీఆర్‌ఎస్ ప్రజల సంక్షేమ ప్రభుత్వం అన్నారు. సీఎం కేసీఆర్ తెలంగాణ రాష్ట్రానికి ఒక ధీమా అని కొనియాడారు. కాంగ్రెస్ ప్రజల నుంచి పైసలు వసూలు చేసిన పార్టీ అని, మనది ప్రజా సంక్షేమ ప్రభుత్వమన్న ఆయన, కడుపులో ఉన్న బిడ్డ నుంచి మొదలు కొని కాటికి పోయే దాకా ప్రభుత్వం అండగా ఉంటుందని చెప్పారు. మనలాంటి ఒక్క పథకం కూడా వారి పాలిత రాష్ట్రాల్లో లేదని, పింఛన్‌ను సైతం రూ.600 నుంచి రూ.1200కు మించి ఇవ్వడం లేదన్నారు. తెలంగాణ రాష్ట్రాన్ని దేశంలోనే అగ్రభాగాన నిలిపిన ఘనత సీఎం కేసీఆర్‌ది అని కొనియాడారు. రాష్ట్ర ప్రభుత్వం అన్ని వర్గాల సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తున్నదని, పథకాలకు ఆకర్శితులయ్యే వివిధ పార్టీల నుంచి బీఆర్‌ఎస్‌లోకి చేరుతున్నారని వివరించారు. పార్టీలోకి వచ్చిన వారు కొత్తపాత అనే తేడా లేకుండా అందరూ కలిసి కట్టుగా పనిచేసి, వచ్చే ఎన్నికల్లో జగిత్యాలలో రెండోసారి బీఆర్‌ఎస్ ఎగరేయాలన్నారు. ఇక్కడ పార్టీ సీనియర్ నాయకులు దావ సురేష్, ప్యాక్స్ చైర్మన్ మైపాల్ రెడ్డి, ఏఎంసీ వైస్ చైర్మన్ ఆసిఫ్, సర్పంచులు గంగనర్సు రాజన్న, బుర్ర ప్రవీణ్, ఉప సర్పంచ్ పద్మ తిరుపతి, గ్రామశాఖ అధ్యక్షుడు పూదరి శ్రీనివాస్, ఏఎంసీ డైరెక్టర్ పులిశెట్టి శ్రీనివాస్, నాయకులు మోహన్ రెడ్డి, తోట పోచమల్లు, మహేశ్, మధు, గంగారాం, షకీల్, లక్ష్మణ్, వెంకటేశ్, గంగారాం, శ్రీనివాస్, గంగాధర్, రాకేశ్, శేఖర్, మహిపాల్, అజయ్, ప్రభు, రాజు, హావేజ్ ఉన్నారు.

# ప్రచార బాటలో వైద్య సేవ

మెట్‌పల్లి : ఎన్నికల ప్రచారంలో మహిళ ను ఓటు అభ్యర్థిస్తున్న డా. సంజయ్ కల్వకుంట్ల



- కోరుట్ల అభ్యర్థి సంజయ్ కల్వకుంట్ల ప్రత్యేకత
- ఊరూరా విస్తృత పర్యటనలు
- అనారోగ్య బాధితులకు వైద్య సాయం

మెట్‌పల్లి, అక్టోబర్ 31: వైద్యవృత్తి నుంచి రాజకీయాల్లోకి అరంగేట్రం చేసిన బీఆర్‌ఎస్ కోరుట్ల అభ్యర్థి డా. కల్వకుంట్ల సంజయ్ ఓ వైపు విస్తృత ప్రచారం చేస్తూనే, మరోవైపు రోగులకు వైద్య సాయం చేస్తున్నారు. సంజయ్ హైదరాబాద్‌లోని యశోద దవాఖానలోని ప్రముఖ వైద్యుల్లో ఒకరు. ఇరవై ఏళ్లుగా వైద్యవృత్తిలో ఉన్నారు. వైద్యసేవల కోసం వచ్చిన ఎందరికో దవాఖానలో వైద్యసహాయం అందించేందుకు తోడ్పడ్డారు. నియోజకవర్గంలోనూ అనేక మార్లు ఉచిత వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి పేద, మధ్యతరగతి ప్రజలకు వైద్య సేవలు అందించారు. కరోనా సమయంలో కిట్లు, కృత్రిమ ఆక్సిజన్ సిలిండర్లు, మందులు పంపిణీ చేశారు. ప్రజలకు మరింతగా వైద్యంతో పాటు అన్ని రకాలుగా సేవచేయాలనే ఒక సదాశయంతో రాజకీయాల్లోకి వచ్చిన ఆయన బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థిగా ఎన్నికల బరిలో నిలిచారు. రెండు నెలలుగా ఊరూరా తిరుగుతూ ఎన్నికల ప్రచారంలో నిమగ్నమయ్యారు. ఎముక, వెన్నుముఖ, ఇతరాత్ర సమస్యలతో తన వద్దకు వచ్చే రోగులకు వైద్యపరమైన సలహాలు, సూచనలు ఇవ్వడంతోనే ప్రతి రోజూ ఉదయం ఆయన దినచర్య ప్రారంభమవుతుంది. ఆ తర్వాత ఎన్నికల ప్రచారంలోకి వెళ్లిపోతున్నారు. ఎన్నికల ప్రచారంలో ఎంత బిజీగా ఆపదలో తనకు వద్దకు వచ్చే రోగులకు 'నేనున్నాను అనే ఒక భరోసాను కల్పిస్తున్నారు. కాగా, మంగళవారం ఉదయం ఎముక, వెన్నెముకకు సంబంధించి సమస్యతో బాధపడుతున్న పలువురు మెట్‌పల్లిలోని పార్టీ కార్యాలయానికి రాగా, సంజయ్ పరీక్షించారు. ఎక్స్‌రేలు, కేస్‌షీట్లను పరిశీలించి, మందులు రాశారు. తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు.

# తిన్న రేవును మరువద్దు

ధర్మపురి: ఆక్సాయిపల్లిలో మంత్రికి బతుకమ్మలతో స్వాగతం పలుకుతున్న యువతులు



- పనిచేసే ప్రభుత్వాన్నే దీవించాలి
- కాంగ్రెస్‌తో రాష్ట్రానికి ప్రమాదం
- ఆ పార్టీ చెప్పేవన్నీ మాయమాటలే
- ధర్మపురి అభ్యర్థి, మంత్రి కొప్పుల ఈశ్వర్
- నేరెళ్ల, ఆక్సాయిపల్లిలో ప్రజా ఆశీర్వాద యాత్ర

ధర్మపురి, అక్టోబర్ 31: ఎన్నికలు వచ్చినయి. కాంగ్రెస్ నాయకులు కొత్త బిచ్చగాళ్లు పొద్దెరుగడు అన్నట్లు ఊళ్లమీద పడ్డరు. ఆ పార్టీతో రాష్ట్రానికే ప్రమాదం. తియ్యతియ్యని మాటలు మాట్లాడుతూ మోసం చేస్తున్నరు. వాళ్లు చెప్పేవన్నీ మాయమాటలే. నమ్మితిమా..? అంతే సంగతి. మళ్లీ పాత కథే అవుతుంది. 60 ఏళ్ల కాంగ్రెస్ పాలనలో ఒక్కటైనా మంచి పథకం అమలు చేశారా..? ఒక్కపేదింటి బిడ్డ పెండ్లికైనా కనీసం రూ.10వేలు సాయమైనా చేశారా..? ఒకసారి ఆలోచించండి' అంటూ మంత్రి కొప్పుల ఈశ్వర్ ప్రజలకు పిలుపునిచ్చారు. మంగళవారం ధర్మపురి మండలం నేరెళ్ల, ఆక్సాయిపల్లి గ్రామాల్లో ప్రజా ఆశీర్వాద యాత్రలో నిర్వహించగా, ఊరూరా మహిళలు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఈశ్వర్ మాట్లాడుతూ రాష్ట్రంలో ఇప్పటి వరకు 12లక్షల మంది ఆడబిడ్డల వివాహానికి కల్యాణలక్ష్మి, షాదీముబారక్ కింద సాయం చేసినట్లు చెప్పారు. పేదలకు అండగా నిలిచామని, అనేక పథకాలతో భరోసా కల్పిస్తున్నామని వివరించారు. ప్రైవేటు దవాఖానల్లో చికిత్స పొందిన పేదలకు ఇతోధికంగా సీఎంఆర్ఎఫ్ కింద సాయం చేస్తున్నామని, తిన్న రేవు తలవాలని, పనిచేసే ప్రభుత్వాన్ని ముఖ్యమంత్రి కేసీఆర్‌ను ఆశీర్వదించాలని మంత్రి ఈశ్వర్ కోరారు. రాష్ట్రం ఏర్పడకముందు పరిస్థితులు ఎలా ఉండేవో..? తెలంగాణ వచ్చాక ఎలా మార్పు జరిగిందో ఆలోచించాలని సూచించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు పడ్డ కరెంటు కష్టాలను గుర్తుకుతెచ్చుకోవాలని, మళ్లీ ఆ నరకం మనకు అవసరమా అని ప్రశ్నించారు. గతంలో రైతుల దగ్గర పన్నులు వసూలు చేసిన చరిత్ర కాంగ్రెస్‌దైతే.. ఇప్పుడు రైతులకే రైతుబంధు, రైతుబీమా, రుణమాఫీ ఇస్తున్న ఘనత బీఆర్‌ఎస్‌దన్నారు. ఆక్సాయిపల్లిలో గిరిజనులకు వందశాతం పట్టాలిచ్చామని, ఇంకా సమస్యలేమైనా ఉంటే పరిష్కరిస్తామని చెప్పారు. ఎమ్మెల్సీ ఎల్ రమణ మాట్లాడుతూ కొప్పుల ఈశ్వర్ లాంటి గొప్ప వ్యక్తి నియోజకవర్గ ఎమ్మెల్యే ఉండడం ఇక్కడి ప్రజల అదృష్టమని, వచ్చే ఎన్నికల్లో భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఇక్కడ రాష్ట్ర దివ్యాంగుల కార్పొరేషన్ చైర్మన్ వాసుదేవరెడ్డి, డీసీఎమ్మెస్ చైర్మన్ డా.ఎల్లాల శ్రీకాంత్‌రెడ్డి, జడ్పీటీసీ బత్తిని అరుణ, ఎంపీపీ చిట్టిబాబు, ఏఎంసీ చైర్మన్ అయ్యోరి రాజేశ్‌కుమార్, ఆర్బీఎస్ మండల కన్వీనర్ సౌళ్ల భీమయ్య, పీఏసీఎస్ చైర్మన్ సౌళ్ల నరేశ్, ఏఎంసీ వైస్ చైర్మన్ అక్కనపల్లి సునీల్‌కుమార్, ఆయా గ్రామాల సర్పంచులు ఉన్నారు.

# రైతుబంధు ఇచ్చే బీఆర్‌ఎస్సా.. రాబందు కాంగ్రెస్సా

- ఎవరు కావాలో మీరే ఆలోచించుకోండి
- రేవంత్‌రెడ్డి పెట్టుబడి సాయం దండుగ అంటున్నడు
- ఆ పార్టీ వస్తే రాష్ట్రం మళ్లీ అంధకారమే
- వేములవాడ బీఆర్‌ఎస్ అభ్యర్థి చల్మెడ లక్ష్మీనర్సింహారావు



బీఆర్‌ఎస్‌లో చేరిన చింతకుంట యువకులతో బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి చల్మెడ లక్ష్మీనర్సింహారావు

మేడిపల్లి/ కథలాపూర్, అక్టోబర్ 31: 'దేశాన్ని, రాష్ట్రాన్ని ఏండ్లకేండ్లు పాలించిన కాంగ్రెస్ చేసిందేమీ లేదు. ప్రజలకు తీరని అన్యాయం చేసింది. రైతుల కోసం ఏ ఒక్క మంచి పనైనా చేసిందా..? గోస పెట్టించుకున్నది. ఇప్పుడు రాష్ట్రంలో సీఎం కేసీఆర్ నాయకత్వంలో రైతులకు మంచిరోజులు వచ్చినయి. నిరంతర కరెంట్, సాగుకు పుష్కలంగా నీళ్లు వస్తున్నయి. ఇంకా రైతుబంధు కింద పెట్టుబడి సాయం కూడా వస్తంది. ఇవన్నీ చూసి కాంగ్రెస్ కండ్లు మండించుకుంటున్నది. నానాయాగి చేస్తంది. రేవంత్‌రెడ్డి రైతు బంధు దండుగ అంటున్నడు. సాగుకు మూడు గంటల కరెంటే చాలని అంటున్నడు. ఇప్పుడే వాళ్లు వక్రబుద్ధి చూపుతున్నరు. ఏదో చేస్తామని ఆచరణ సాధ్యంకాని హామీలు ఇస్తూ ప్రజలను మోసం చేస్తున్నరు. జాగ్రత్త. లేదంటే గోసపడుతరు' అని వేములవాడ బీఆర్‌ఎస్ అభ్యర్థి చల్మెడ లక్ష్మీనర్సింహారావు ప్రజలకు సూచించారు. కథలాపూర్ మండల కేంద్రం ఎస్‌ఆర్‌ఆర్ ఫంక్షన్ హాల్, మేడిపల్లి మండల కేంద్రంలో మంగళవారం నిర్వహించిన దివ్యాంగుల ఆత్మీయ సమ్మేళనాలకు వికలాంగుల సహకార సంస్థ చైర్మన్ కేతిరెడ్డి వాసుదేవరెడ్డితో కలిసి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆయా కార్యక్రమాల్లో చల్మెడ లక్ష్మీనర్సింహారావు మాట్లాడారు. సీఎం కేసీఆర్ రైతులకు పంట రుణమాఫీ, ఉచిత కరెంట్, రైతుబంధువుతోపాటు రైతు బీమాతో రైతు కుటుంబానికి భరోసా కల్పించారన్నారు. ఇప్పుడు మళ్లీ అధికారంలోకి వస్తే ఇంటింటికీ కేసీఆర్ బీమా కింద రూ. 5లక్షల బీమా సౌకర్యం కల్పిస్తారని చెప్పారు. కర్ణాటకలో పుష్కలంగా కరెంటిస్తామని చెప్పి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్, అక్కడి ప్రజలు, రైతులను మోసం చేసిందని, 5 గంటల కంటే ఎక్కువ టైం ఇవ్వలేమని చేతులెత్తేసిందని మండిపడ్డారు. ఓటమి భయంతో కాంగ్రెస్ ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నదని, ఆ పార్టీ నాయకులు దుబ్బాక బీఆర్‌ఎస్ అభ్యర్థి కొత్త ప్రభాకర్ రెడ్డిపై కత్తితో దాడి చేయించడం దారుణమన్నారు. కాంగ్రెస్ వస్తే అశాంతి నెలకొంటుందని, అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

**ఐక్యతను చాటుదాం.. కేసీఆర్‌కు అండగా ఉందాం: దివ్యాంగుల సహకార సంస్థ చైర్మన్ కేతిరెడ్డి వాసుదేవరెడ్డి**

సీఎం కేసీఆర్ వచ్చాకే దివ్యాంగులకు గౌరవం దక్కిందని, ఎన్నికల్లో దివ్యాంగులం అందరం కలిసి ఐక్యతను చాటి.. సీం కేసీఆర్‌కు అండగా ఉండాలని దివ్యాంగుల సహకార సంస్థ చైర్మన్ కేతిరెడ్డి వాసుదేవరెడ్డి కోరారు. దివ్యాంగుల జీవితాల్లో వెలుగులు నింపారని రూ.500 ఉన్న పింఛన్లు రూ.1500, రూ.3వేలు చేశారని, మొన్ననే అడగకముందే రూ.4వేలు చేసిన ఘనత సీఎం కేసీఆర్‌దేనని కొనియాడారు. ఎన్నికల అనంతరం రూ.6వేలు ఇస్తామని మ్యానిఫెస్టోలో ప్రకటించడం హర్షనీయమన్నారు. కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల్లో రూ. 200 నుంచి రూ.1100కు మించి ఇవ్వడం లేదని, ఇక్కడికి వచ్చి రూ. 4వేలు ఇస్తామని చెప్పడం హ్యాస్యాస్పదంగా ఉందని ఎద్దేవా చేశారు. ముందుగా వారి పాలిత రాష్ట్రాల్లో ఇచ్చిన తర్వాత ఇక్కడికి వచ్చి మాట్లాడాలని సూచించారు. దివ్యాంగుల కోసం ప్రభుత్వం దేశంలో ఎక్కడా లేనివిధంగా అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టిందని, సీఎం కేసీఆర్‌కు అండగా ఉండి కారు గుర్తుకు ఓటు వేసి చల్మెడను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. మేడిపల్లిలో జరిగిన కార్యక్రమంలో జడ్పీ ఉపాధ్యక్షుడు వొద్దినేని హరిచరణ్‌రావు, సర్పంచ్‌ల ఫోరం మండలాధ్యక్షుడు వంగ వెంకటేశం, సర్పంచ్‌లు గడ్డం నారాయణరెడ్డి, గాజోజి చారి, ఎంపీటీసీలు మకిలి దాస్, పల్లి అర్జున్, బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు క్యాతం సత్తిరెడ్డి, రైతు సమన్వయ సమితి జిల్లా కార్యవర్గ సభ్యులు కాటిపెల్లి శ్రీపాల్‌రెడ్డి, నాయకులు అంకం విజయసాగర్, నెల్లుట్ల ప్రభాకర్, కొండ కిషన్, అంగడి ఆనంద్ కుమార్, ఆదె లక్ష్మిరాజం, సుధవేని భూమేష్ గౌడ్, బత్తుల రమేశ్ పాల్గొన్నారు.